కార్తీక పూజలకు వేళాయె


పద్మనాభం శివాలయం వద్ద మహాశివుని విగ్రహం


సంగివలసలోని పురాతన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం


మహా కామేశ్వర స్వామి ఆలయంలోని స్వామి వారు

తగరపువలస : కార్తీకమాస పూజలకు భీమిలి పరిధిలో శివాలయాలు ముస్తాబయ్యాయి. వాస్తవానికి సోమవారం మధ్యాహ్నానికే కార్తీకమాస ఘడియలు ప్రవేశించినా మంగళవారం సూర్యోదయం నుంచి పుణ్యస్నానాలు ఆచరించాలని పండితులు తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో తాటితూరు ఉత్తర రామలింగేశ్వరాలయం, సంగివలస పురాతన ఉమా రామలింగేశ్వర ఆలయంలో నెల రోజులు ప్రత్యేక పూజలు, ఆకాశదీప దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవే కాకుండా భీమిలి మండలంలోని లక్ష్మీపురం, టి.నగరపాలెం, అమనాం, బసవపాలెం, మూలకుద్దు, జీవీఎంసీ పరిధిలో చిట్టివలస, కొండపేట, సత్యనారాయణపేట, బంగ్లామెట్ట, సంగివలసలోని ఆలయాల్లో ఈ నెల రోజులపాటు ప్రత్యేక పూజలు జరపనున్నారు. వీటిలో ఎక్కువ ఆలయాలు గోస్తనీ నది తీరాన ఉన్నవే కావడం గమనార్హం. వీటిలో సంగివలసలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి వారణాసిలో ఉన్నట్టే ఉత్తర ముఖంగా గోస్తనీనది ప్రవహిస్తుంది.

పద్మనాభం: మండలంలోని పలు శివాలయాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీక మాసోత్సవాలకు సిద్ధమయ్యాయి. పద్మనాభంలోని శివాలయం, మహా శివుని విగ్రహం, విలాస్కాన్ పాలెం, గంధవరం, పాట్నూరు, రెడ్డిపల్లి, కురపల్లి, తునివలస, బి.ఆర్,తాళ్లవలస, గెద్దపేట, అనంతవరంలోని ధారకొండపై వెలసిన శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పూజలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలను భక్తులు కార్తీక మాస పూజలకు సిద్ధం చేశారు. గుడిలోవలోని పురాతన నారాయణేశ్వర ఆలయం కార్తీక మాసంలో భక్తులతో కిటకిటలాడుతుంది. ఆనందపురం - పెందుర్తి రోడ్డుకు సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో కొండల నడుమ ఉన్న ఈ దేవాలయం ముందు భాగంలో గల ఆకాశ గంగ ఎంతో పవిత్రమైనది. దేవాలయానికి వచ్చే భక్తులు ఆకాశగంగలో స్నానమాచరించి పూజలు చేస్తారు. ఇక్కడి నారాయణేశ్వర ఆలయంతోపాటు, రంగనాథస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి విగ్రహం ఉన్నాయి. చుట్టూ ఎత్తైన కొండలు, పచ్చని చెట్లతో అలరారుతున్న గుడిలోవ ప్రాంతం మంచి పిక్నిక్ స్పాట్‌గా వెలుగొందుతోంది. అలాగే మండలంలోని బోనిలో గోస్తనీ నదికి అభిముఖంగా ఉన్న అమరేశ్వర ఆలయం ఎంతో గుర్తింపు పొందింది. ఈ దేవాలయంలో భూ గర్భంలో పైకి కనిపించే విధంగా ఉన్న స్వయంభూ శివలింగం ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. గిడిజాల, కుసులువాడ, గంభీరం ప్రాంతంలోని చింతల అగ్రహారం, ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలోని పురాతన శివాలయాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి.

మధురవాడ : కార్తీకమాస పూజలకు ఏర్పాట్లు చేశామని ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, కార్యదర్శి అప్పారావు చెప్పారు. ఈ నెల 20న మొదటి సోమవారం ప్రత్యేక పూజలు చేయిస్తామన్నారు. అలాగే మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, సిద్ధేశ్వర స్వామి పీఠంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

భీమునిపట్నం: భీమిలిలోని ఒకే ప్రాంగణంలో వున్న చారిత్రిక పురాతన శివాలయాల్లో కార్తీక మాసోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడి భీమేశ్వర కాత్యాయని ఆలయంలో ద్వాపరయుగ కాలంలో భీముడు తన స్వహస్తాలతో శివలింగాన్ని ప్రతిష్ఠించాడని భావిస్తారు. 11వ శతాబ్దంలో చోళరాజులు చోడేశ్వర భ్రమరాంబిక ఆలయం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ ఆలయాల పక్కనే 17వ శతాబ్దంలో విజయనగరం సంస్థానాధీశులు చంద్రశేఖర బాలత్రిపుర సుందరి ఆలయాన్ని నిర్మించారు. ఇలా ఒకే ప్రాంగణంలో విశిష్ట ప్రాధాన్యత కలిగిన మూడు ఆలయాల్లో మంగళవారం నుంచి కార్తిక మాసోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.


గుడిలోవలో ఉన్న నారాయణేశ్వర ఆలయం


భీమిలిలోని భీమేశ్వర కాత్యాయని ఆలయం


ఆలయంలో ఉమా రామలింగేశ్వరస్వామి

క్లుప్తంగా

అష్టలక్ష్మి సన్నిధిలో పూజలు


ఆలయంలో నిర్వహిస్తున్న అష్టలక్ష్మీ హోమం

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదివారం, సోమవారం రెండు రోజులపాటు దీపావళి అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్ములను ప్రత్యేకంగా అలంకరించి, శ్రీ అష్టలక్ష్మీ హోమం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. అనంతరం కుంకుమ పూజలు, దీపాలంకరణసేవ నిర్వహించినట్లు తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ


మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు సత్యనారాయణ

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు శిక్షణ పొందుతున్న 126 మంది విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి తరఫున సోమవారం ఉచితంగా శిక్షణతోపాటు ఫలహారాలు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జి.సత్యనారాయణ, శివకుమార్, ఎం.సూర్యారావు, పక్కి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించి స్కాలర్‌షిప్ దక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బింద్రానగర్‌లో బీటీ రోడ్ల నిర్మాణం


బింద్రానగర్‌లో నిర్మాణం పూర్తయిన బీటీ రోడ్డు

మధురవాడ: ఎన్నో ఏళ్లుగా సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్న పలు కాలనీలు, నివాస ప్రాంతాలకు ప్రభుత్వం రోడ్లు, కాల్వలు నిర్మిస్తోంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్‌లోని దత్త కృష్ణ ఆర్కేడ్, నరసింహ రెసిడెన్సీ, సత్యసాయి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌తోపాటు ఇతర చోట్ల రోడ్లు లేక పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు రూ.18.60 లక్షలతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు పనులు పూర్తవడంతో పరిసర అపార్ట్‌మెంట్ వాసులతోపాటు కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శంకరరావు మృతికి సంతాపం


కూరాకుల శంకరరావు (ఫైల్)

తగరపువలస: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూరాకుల శంకరరావు ఆదివారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు శ్రీనగర్‌లో చనిపోయారు. అస్వస్థత కారణంగా కొంతకాలంగా ఇంటికే పరిమితమైన శంకరరావు ఉత్తరాంధ్రలో లైటింగ్ శంకరరావుగా అందరికీ సుపరిచితుడే. ఫంక్షన్లు, గ్రామదేవతల ఉత్సవాల డెకరేషన్‌లో అతనిది అందె వేసిన చేయి. ఈయనకు వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, టీడీపీ, వామపక్ష పార్టీల్లో సీనియర్ నాయకుల నుంచి కార్యకర్తల వరకు అందరితో మంచి పరిచయాలు ఉన్నాయి. ఆయన మృతిపట్ల అన్ని పార్టీల నాయకులు నివాళులర్పించారు.

విద్యార్థులకు రూ.16వేల సాయం

తగరపువలస: భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలికి చెందిన 40 మంది విద్యార్థుల హిందీ పరీక్షల ఫీజు, పుస్తకాల నిమిత్తం స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ అధినేత కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి రూ.16వేల సాయం అందించారు. దక్షిణ భారత హిందీ ప్రచారసభ ద్వారా నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఈ సాయం అందిస్తామని ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. విద్యార్థులకు ఈ నెల 19న పుస్తకాలు అందిస్తామని తెలిపారు.

గోవర్ధన పూజ నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మంగళవారం గోవర్ధన పూజ వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా అన్నం, స్వీట్లు, పలుకులు, పండ్లతో అన్నకూట్ (ఆహార పర్వతం) ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తామని, పంచామృతాభిషేకాలు, పూలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష్య, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్. గుమ్ములూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతోపాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం- కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతులు మీదుగా మంగళవారం డాక్టర్.గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. అనంతరం బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం- కాశీఖండం ప్రవచనాలను డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్టడీస్ పూర్వ విభాగాధిపతి డాక్టర్.పి.ఇందిర పాల్గొంటారన్నారు. వీఎండీఏ ప్రతినిధి పైడా క్రిష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఉపాధి దెబ్బతీసేందుకు కుట్రలు


చిట్టివలస పెద్ద చెరువు వద్ద నిరశన తెలుపుతున్న మత్స్యకారులు

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువు కేంద్రంగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మైదాన ప్రాంత మత్స్యకారుల ఉపాధికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. సోమవారం పెద్ద చెరువు వద్ద చిట్టివలస స్వదేశీ మత్స్యకారులు నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాటితూరు స్వదేశీ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఎ – 59 అధ్యక్షుడు సింగిడి గణేష్ మాట్లాడారు. చెరువులో పెంచుతున్న చేపలకు మాంసాహార వ్యర్థాలు వేస్తున్నట్టు చేస్తున్న ఆరోపణలు అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. తాము సర్వే నంబర్ 24లో విస్తరించిన 36.40 ఎకరాల చెరువులో రాగండి, బొచ్చె, ఎర్రమైల, బంగారుపాప వంటి మంచినీటి చేప పిల్లలు మాత్రమే వేస్తున్నామన్నారు. ఇవి గడ్డి, నాచు తినే చేపలే తప్ప మాంసం వ్యర్థాలు తినేవి కాదని గ్రహించాలన్నారు. చెరువు సుందరీకరణతో పాటు కాలువలు, గెడ్డలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు మూసివేయడం వల్ల చెరువులోకి వచ్చే మురుగు నీరు వెలుపలకు వెళ్లే మార్గం పూడుకుపోవడంతో దుర్వాసన వస్తోందన్నారు. 1964 సహకార సంఘం చట్టప్రకారం వ్యవసాయరంగానికి అనుబంధంగా ఉన్న మత్స్యకార రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర, ఫిష్ హబ్, చేప పిల్లలు, వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తోందని గుర్తు చేశారు. 30 ఏళ్లుగా 8 గ్రామాల మత్స్యకారులు ఈ చెరువుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. నిరాధార ఆరోపణలు చేసే వారిపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని గణేష్ హెచ్చరించారు.

కార్మికుల మదిలో రామునాయుడు


గుజ్జు రామునాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తగరపువలస: చిట్టివలస లేబర్ యూనియన్ నాయకుడు గుజ్జు రామునాయుడు వర్ధంతి సందర్భంగా సోమవారం గుడివాడలోని ఆయన విగ్రహానికి లేబర్ యూనియన్, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు మాట్లాడుతూ సర్పంచ్‌గా, కార్మికనేతగా, రైతన్నకు అండగా పనిచేసిన రామునాయుడు భీమిలి నుంచి పీవీజీ రాజుపై సీపీఐ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారన్నారు. ఆయన చనిపోయి నాలుగు దశాబ్దాలు గడచినా కార్మికవాడ ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. కార్యక్రమంలో కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, చిల్ల అప్పలసూరి, అప్పలరాజు, నూలు ఆదినారాయణ, మావూరి వీర్రాజు, తూతిక సోమరాజు, కొనస చంద్రయ్య, దాసరి అప్పలస్వామి, అప్పల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు


రామన్నపేట వద్ద రహదారి పైనుంచి కాలువలోకి జారిపోతున్న మెటీరియల్


కాలువ నిర్మాణం కోసం తవ్విన డెబ్రిస్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేటలో ఇటీవల చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణం జరుగుతున్న చోట ఇరుకైన మార్గంలో డెబ్రిస్, ప్రధాన రహదారిపై నిర్మాణ మెటీరియల్ రోజుల తరబడి ఉండిపోయింది. ఇవి డ్రైనేజీల్లో జారిపడుతుండడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని రామన్నపేట వాసులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా ప్రత్యంగిరా భద్రకాళి హోమం


లలితా పీఠంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

సీతంపేట: అమావాస్య సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో సోమవారం ఉదయం ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం లలితా పీఠంలో పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పర్యవేక్షణలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పీఠం ఆవరణలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తీక మాసం నెల రోజులు ప్రతి రోజూ సాయంత్రం కాళీ కాలభైరవులకు ఏకవార పంచామృత అభిషేకం జరుగుతుందని, పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కృష్ణసేన్ కోరారు.

హైవే కూడళ్లలో చీకట్లతో ప్రమాదాలు


గొల్లల తాళ్లవలస కూడలి వద్ద వెలగని విద్యుత్ దీపాలు


వెంకటేశ్వరమెట్ట వద్ద వెలగని హైవే, జీవీఎంసీ విద్యుత్ దీపాలు

తగరపువలస: జాతీయ రహదారిపై భీమిలి పరిధిలో వెంకటేశ్వరమెట్ట, వలందపేట, గొల్లల తాళ్లవలస కూడళ్లలో విద్యుత్ దీపాలు వెలగక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 10న వెంకటేశ్వరమెట్ట వద్ద రోడ్డు దాటుతున్న ఊడికల పైడిరాజు అనే సెక్యూరిటీ గార్డు ద్విచక్ర వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. రోడ్డు దాటుతున్న కూడలి వద్ద విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ద్విచక్ర వాహనదారునికి కనిపించక ఈ ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రస్తుతం ప్రమాదాలు జరుగుతున్న ఈ కూడళ్లలో రహదారి వాలుగా ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలను డ్రైవర్లు అదుపు చేయలేకపోతున్నారు. ఈ ప్రదేశాల్లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లు కూడా వాహనాల కింద నలిగిపోతున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన కూడళ్ల వద్ద జీవీఎంసీ, హైవే అథారిటీ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు పునరుద్ధరించి రోడ్డు దాటకుండా డివైడర్‌పై రెయిలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు దాటేవారితో అయోమయం

వెంకటేశ్వరమెట్ట వద్ద ఇరువైపులా బస్టాప్‌లు ఉండటంతో ఒక మార్గంలో బస్సులు దిగేవారు మరో మార్గంలో వెళ్లాల్సిన బస్సుల కోసం అడ్డదిడ్డంగా ఒక్కొక్కరు ఒక్కోచోట రోడ్డు దాటుతున్నారు. దీంతో వాహనదారులు కూడా తరచూ అయోమయానికి గురవుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రోడ్డు దాటే ఈ కూడలిలో చిన్నపాటి ఫుట్‌వంతెన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే తాళ్లవలస, గొల్లల తాళ్లవలస, వలందపేట గ్రామాల్లో హైవేకు ఇరువైపులా గ్రామాలు విస్తరించడంతో కిరాణా, పాలు, ఫంక్షన్లు, చావులు, తాగునీరు, ఆస్పత్రులు, పాఠశాలకు నిత్యం ప్రమాదకరమైనా రహదారులను దాటాల్సి వస్తోంది. రహదారి భద్రతపై అవగాహన లేని వాహనదారులు, స్థానికుల వల్ల కూడా ఇక్కడ తరచూ ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు ఫుట్‌వంతెనలు, రెయిలింగ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


చిన్నాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం, బుడ్డివలస గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు బి.పైడన్న, జి.కృష్ణ సూరప్పడు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ టోర్నమెంట్


పోటీలను ప్రారంభిస్తున్న పాస్టర్ విజయకుమార్

తగరపువలస: భీమిలి యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమిలి, తగరపువలస ప్రాంతాల క్రిస్టియన్ యువతకు నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. వివిధ సంఘాలకు చెందిన 30 జట్లు చిట్టివలస దీనబంధు షటిల్‌కోర్టులో నిర్వహించిన టోర్నీలో పాల్గొన్నాయి. పోటీలను ఆంధ్రా బాప్టిస్ట్ సంఘ కాపరి గిడియన్ విజయకుమార్ ప్రారంభించారు. పోటీల్లో విన్నర్స్‌గా బాలుర విభాగంలో తగరపువలసకు చెందిన మనోజ్, శామ్యూల్, బాలికల విభాగంలో సియోను ప్రార్థన మందిరం నుంచి వెరోనికా, ప్రసన్న నిలిచారు. రన్నర్స్‌గా బాలుర విభాగంలో తగరపువలసకు చెందిన జోయల్, స్టెన్నీ, బాలికల విభాగంలో ఆంధ్ర బాప్టిస్ట్ సంఘ యువతులు షారోన్, స్ఫూర్తి నిలిచారు. వీరికి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ఎం.సుధాకర్, జె.ఆల్బర్ట్ సుదర్శన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గిరిధర్, ప్రేమ్ స్వరూప్, శంకరరావు, దత్తి ఈశ్వరరావు, శంకర్‌కుమార్, కోశాధికారి కె.ప్రేమానందరావు, బోర్డు సభ్యులు జోసెఫ్ జేమ్స్, ఎస్వీపీడీ ప్రభాకర్, కృపారావు సహాయ సహకారాలు అందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెప్సీ ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విశాఖ జోన్ 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బాబానగర్, విజేతా సూపర్ మార్కెట్ ఏరియా, కారుషెడ్ ఏరియా, 45వ నంబరు సచివాలయం పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

పాక్షికంగా ఇల్లు దగ్ధం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీ కాగితాలపేటలో ఆదివారం సాయంత్రం బాణసంచా అదుపు తప్పి కాగితాల సత్యం అనే వ్యక్తి ఇంటిపైకి దూసుకుపోవడంతో కాలిపోయింది. బాధితునిది మిద్దె ఇల్లు కావడంతో పాక్షికంగా నష్టం జరిగింది.